చింతమడకలో జరిగే సీతారాముల కల్యాణానికి హాజరుకావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్న గ్రామపెద్దలు, చిత్రంలో కల్వకుంట్ల వంశీధర్‌రావు

సీతారాముల కల్యాణానికి రండి

- **కేసీఆర్‌ను ఆహ్వానించిన చింతమడక గ్రామస్థులు**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా గ్రామంలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి రావాలని స్వగ్రామం చింతమడకవాసులు బీఆర్ఎస్ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావును ఆహ్వానించారు. శనివారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాసంలో బీఆర్ఎస్ సీనియర్ నేత కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించినవారిలో గ్రామ పెద్దలు రామాగౌడ్, హంసకేతన్‌రెడ్డి, మల్లుపల్లి పోశయ్య, సత్యనారాయణగౌడ్, శేఖర్ తదితరులున్నారు.

భద్రాద్రి భక్తులకు ఆన్‌లైన్‌లో వసతి సౌకర్యం

హైదరాబాద్, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): భద్రాచలంలో జరిగే శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం, మహోత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్టు అధికారులు చెప్పారు. సామాన్య భక్తులతోపాటు అందరికీ టికెట్ల వివరాలను, వసతి కోసం గదులను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని వెల్లడించారు. bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి టికెట్లు బుక్ చేసుకోవచ్చని సూచించారు.

ఓటమి భయంతో బీజేపీ కాంగ్రెస్ కుట్ర

- **నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు వార్తలు**
- **మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): ఓటమి భయంతో బీజేపీ, కాంగ్రెస్ కలిసి తనపై కుట్రలు పన్నుతున్నాయని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక మీడియాకు లీకులు ఇచ్చి, తప్పుడు వార్తలు రాయించి లబ్ధి పొందాలని చూస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లో తాను పోటీ కూడా చేయలేదని, కానీ తాను డబ్బులు తరలించినట్టు కథ అల్లి ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకుముందు వరకు తాను ఎమ్మెల్సీగా పరోక్ష రాజకీయాల్లోనే ఉన్నానని గుర్తుచేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి బీజేపీ, కాంగ్రెస్ చేతులు కలిపి నన్ను ఓడించాలని దుష్ట పన్నాగం పన్నుతున్నాయి. సిద్ధాంతాలు, విలువలు గాలికి వదిలి, ప్రజలను మభ్య పెట్టే స్థాయికి దిగజారాయి. ప్రభుత్వ ఉద్యోగిగా, కలెక్టర్‌గా ప్రజలకు నిజాయితీగా సేవలు అందించా. ప్రజా సేవకుడిగా ఇంకా ఎక్కువ సేవలు అందించడానికి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా. పేద విద్యార్థులకు విద్య అందించేందుకు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం వంద కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేశా. ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మించి సేవలు అందిస్తా. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పే వ్యక్తిని కాదు. నీచ రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు. ఈ విషయం ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలందరికీ తెలుసు' అని వెల్లడించారు. తనపై విమర్శలు చేయడానికి ఎలాంటి అవకాశం లేకపోవటంతోనే బీజేపీ, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని, తన మనోస్థైర్యం దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఎన్ని కుతంత్రాలు చేసినా, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు తనవైపే ఉన్నారని స్పష్టం చేశారు.

1500 కోట్ల వడ్ల కుంభకోణం

- **ఈడీ, సీబీఐ సుమోటోగా దర్యాప్తు చేయాలి**
- **తక్కువ ధరకే ధాన్యం విక్రయం**
- **రేవంత్ సర్కార్ అవినీతికి పరాకాష్ఠ**
- **రాహుల్, రేవంత్ ట్యాక్స్‌లు వసూలు**
- **సీఎం రేవంత్‌రెడ్డికి ధనం ధ్యాసే**
- **మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత ఆశన్నగారి జీవన్‌రెడ్డి**

తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1500 కోట్ల వడ్ల కుంభకోణానికి పాల్పడిందని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. వ్యాపారులతో కుమ్మక్కై 35 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను తక్కువ ధరకు విక్రయించారని క్వింటాకు రూ.700 చొప్పున నష్టం వచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు ఇందులో పాత్రధారులుగా ఉన్నారని చెప్పారు. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వెంటనే సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని, లేకుంటే తామే ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. తెలంగాణభవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. గోదాముల్లో నిలువ ఉన్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్లు పిలిచి క్వింటాలు రూ.1900 చొప్పున ప్రభుత్వం అమ్మిందని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో రూ.1450 కోట్ల మేరకు కుంభకోణం జరిగిందని చెప్పారు. గ్లోబల్ టెండర్లు పిలిచి 35 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను అతి తక్కువ ధరకు ఏపీకి, ఉత్తరాదికి చెందిన వ్యాపారులకు కట్టబెట్టారని ఆరోపించారు. ఈ కుంభకోణంలో ప్రతి జిల్లా మంత్రికి పర్సంటేజీలు ముట్టాయని అన్నారు. వడ్ల కుంభకోణంపై బీజేపీ నేతలు బండి సంజయ్, రఘునందన్‌రావు, కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ ఆర్ (రాహుల్-రేవంత్) ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నదని చెప్పారు. దేశంలోని మిగిలిన 26 రాష్ట్రాలకు తెలంగాణ నుంచి డబ్బులు ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధాన్యం ధ్యాస లేదని, ధనం ధ్యాసే ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ హస్తం అవినీతి నేస్తమని అన్నారు. ఇది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ కాదని, ఇది ఇండియన్ నేషనల్ కరప్షన్ పార్టీ అని అభివర్ణించారు. కాంగ్రెస్, అవినీతి రెండూ రాహుకేతువులని, కవల పిల్లలని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలు బుట్టదాఖలయ్యాయని చెప్పారు. స్కీములు నిల్, స్కామ్‌లు ఫుల్ అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో వడ్లు దేశమంతా ఎగుమతి అయితే రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ నుంచి నోట్లు ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో స్కీంల పాలన పోయి స్కాంల పాలన వచ్చిందని అన్నారు. ఢిల్లీకి కప్పం చెల్లించేందుకు రేవంత్ అక్రమ దందాలు చేయడంలో బిజీగా ఉన్నారని చెప్పారు. అవినీతి చేసుకోవచ్చని మంత్రులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సమకూరుస్తానని చెప్పినందుకే రేవంత్‌కు సీఎం పోస్టు వచ్చిందదని తెలిపారు. కాంగ్రెస్ మోసాలకు ఈ నాలుగు నెలల్లో ఎక్కువగా నష్టపోయింది రైతులేనని అన్నారు. రేవంత్‌రెడ్డి రైతుల పాలిట రాబందులా మారారని, రైతు భరోసా నుంచి పంటలకు బోనస్ వరకు రేవంత్‌వన్నీ బోగస్ మాటలేనని మండిపడ్డారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో రైతులు అడ్డికి పావుశేరులా ప్రైవేటు వారికి పంటను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడే ముఖ్యమంత్రికి రైతుల గురించి మాట్లాడే తీరిక లేదని, ఢిల్లీకి ట్రిప్పులు కొట్టడం తప్ప రైతుల ధ్యాస లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులను, ఉద్యోగులను, మహిళలను అందర్నీ మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిందేనని అన్నారు. ఎంపీ రంజిత్ రెడ్డి, కడియం శ్రీహరి, కేశవరావుకు బీఆర్ఎస్ ఏం తక్కువ చేసిందని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లాలో భూములను ఆక్రమించారని, అక్రమాలు చేశారని ఆరోపించారు. వీరు మళ్లీ పార్టీలోకి వస్తే తీసుకునే ప్రసక్తే లేదని, తానే తెలంగాణ భవన్ దగ్గర ఉండి రాకుండా అడ్డుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి

- **ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు దూసరి అశోక్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. లండన్‌లో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే కార్యవర్గం భేటీలో అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు ఎన్నారై బీఆర్ఎస్ యూకే ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ వందరోజుల పాలనలో రాష్ట్రంలో విద్యుత్తు సమస్యలు, నీళ్ల సమస్యలతో పాటు రైతుల ఆత్మహత్యలు పెరిగాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహంతో ఊగిపోతున్నారని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడేది బీఆర్ఎస్ మాత్రమే అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను, సమస్యలను పార్లమెంట్ వేదికగా తెలంగాణ గొంతుకను వినిపించేది గులాబీ పార్టీ ఎంపీలేనని తెలిపారు. సమావేశంలో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే అడ్వైజరీ బోర్డు వైస్ చైర్మన్ చందుగౌడ్ సిక్కా, ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, కార్యదర్శి సత్యమూర్తి చిలుముల, ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ నేతలు రవి ప్రదీప్ పులుసు, అబ్దుల్ జాఫర్, వెంకట్ రెడ్డి, సురేశ్ గోపతి, వీర ప్రవీణ్ కుమార్, రమేశ్ ఎసెంపెల్లి, రవి రేతినేని, సత్యపాల్ పింగిళి, పృథ్వీ రావుల, గణేశ్ కుప్పాలా, మధు యాదవ్ ఆబోతు తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'కి 60 కోట్లు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైన మహాలక్ష్మి పథకం కోసం ప్రభుత్వం నిధుల విడుదల చేసింది. సబ్సిడీ గ్యాస్ స్కీం అమలుకు రూ.60 కోట్లు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

బీసీల దమ్మేందో చూపిస్తాం..

- **జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్ కొండూరు**

హైదరాబాద్, ఏప్రిల్13 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ, ఎంబీసీల దమ్మేందో చూపిస్తామని, కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి ఖబడ్దార్ అంటూ జాతీయ ఎంబీసీ సంఘాల సమితి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ హెచ్చరించారు. సెల్ఫీ వీడియోలో బీసీలపై మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను ప్రకటించారని, కాంగ్రెస్, బీజేపీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని అభ్యర్థులుగా ప్రకటించాయని పేర్కొన్నారు. 'బీసీలకు దమ్ము ధైర్యం ఉంటే.. చేతనైతే బీసీ అభ్యర్థిని ఎలా గెలిపిస్తారో గెలిపించుండ్రి చూస్తాం' అంటూ మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సవాల్‌గా తీసుకుంటున్నామని, రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీసీ, ఎంబీసీల దమ్ముధైర్యాన్ని, ఐక్యతను చూపిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో 6 స్థానాలను బీసీలకు కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. బీసీలు, మాదిగలకు ఒక్క పార్లమెంట్ సీటు కూడా ఇవ్వకుండా కించపరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ నేత సారీ చెప్పాలి

- **రాష్ట్ర ఎంబీసీ కో-కన్వీనర్ రాచమల్ల బాలకృష్ణ**
- **నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్**

రాచమల్ల బాలకృష్ణ

పెంబర్తి శ్రీనివాస్

ఆర్కేపురం, ఏప్రిల్ 13 : బీసీలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కో-కన్వీనర్ రాచమల్ల బాలకృష్ణ, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 70 శాతం బీసీల జనాభా ఉందని, బీసీ సమాజంలో ఉన్న అన్ని కులవృత్తులు సమాజంతో ముడిపడి ఉన్నాయని, అలాంటి వారి పట్ల మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కులహంకారానికి నిదర్శనమని బాలకృష్ణ పేర్కొన్నారు. మళ్లీ బీసీ వర్గాలను అవమానిస్తే నాలిక కోస్తామని హెచ్చరించారు. బీసీ సోదరులారా ఇప్పటికైనా ఆలోచించి మన ఓట్లు మనకే, మన సీట్లు మనకే అనే నినాదంతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు.

రైతుల కోసం దీక్ష.. పోలీసుల నోటీసులు

- **జడ్పీ చైర్మన్ పుట్ట మధుపై కేసు నమోదు**

మంథని, ఏప్రిల్ 13: పెద్దపల్లి జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్‌కు మంథని పోలీసులు గురువారం నోటీసులు జారీ చేశారు. సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బాధిత రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని, ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజుల క్రితం మంథని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అనుమతి లేకుండా దీక్ష చేసినందుకు పుట్ట మధూకర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేశారు. మంథనిలోని రాజగృహలో పుట్ట మధూకర్‌కు పోలీసులు నోటీసులు అందించారు.

అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- **అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే మోసం**
- **బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శివారులో నిర్వహించిన విద్యార్థి, యువజన చైతన్య సదస్సులో మాట్లాడుతున్న వినోద్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, ఏప్రిల్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. అబద్ధాల పునాదులపై అధికారం చేపట్టిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ శివారులోని శుభం గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి విద్యార్థి, యువజన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల సమస్యలకు ఢిల్లీలో పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీలతోనే సాధ్యమవుతుందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు అధిష్ఠానం అడుగులకు మడుగులొత్తుడు తప్ప తెలంగాణ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించే అవకాశం ఉండదని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ తాకట్టుపెట్టి పదవులు అనుభవిస్తున్నారు తప్ప ఇక్కడి సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం లేదని విమర్శించారు. ఎంపీగా కరీంనగర్‌కు బండి సంజయ్ చేసిందేమీ లేదని, కేంద్రం నుంచి వచ్చే నిధులన్నీ తానే తెచ్చినట్లు అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నాడని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించడంలో యువత, విద్యార్థులు ముందుండి పనిచేయాలని పిలుపునిచ్చారు.తాను ఎంపీగా గెలిస్తే హుస్నాబాద్ నియోజకవర్గంలోని యువత, విద్యార్థుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, రాజకీయ విశ్లేషకులు వీ ప్రకాశ్, నాయకులు కర్ర శ్రీహరి, దరువు ఎల్లన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే నా ప్రయాణం

- **మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి**

మద్దూర్(కొత్తపల్లి), ఏప్రిల్ 13 : బీఆర్ఎస్‌తోనే తన ప్రయాణం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా శనివారం నారాయణపేట జిల్లా మద్దూర్‌లో నిర్వహించిన కొత్తపల్లి, మద్దూరు మండలాల పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి పట్నం హాజరై మాట్లాడారు. తన సోదరుడు పట్నం మహేందర్‌రెడ్డి గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరినా తాను మాత్రం కేసీఆర్ నాయకత్వంలోనే కొనసాగుతానని తెలిపారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై 120 రోజుల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు.

ఖమ్మంలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు. చిత్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బీజేపీ ఓటమే లక్ష్యంగా పనిచేయాలి

- **సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు**

ఖమ్మం కమాన్‌బజార్, ఏప్రిల్ 13 : దేశంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ, ఎన్డీఏ కూటమిని గద్దెదించడమే లక్ష్యంగా ప్రధాన ఎజెండాతో పార్లమెంటు ఎన్నికల్లో సీపీఎం, ఇండియా కూటమి ముందుకెళ్తున్నదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని ప్రమాదకరస్థాయికి తీసుకెళ్లిందని, ఎన్డీఏ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే దేశ రాజ్యాంగ స్వభావమే పూర్తిగా మారిపోతుందని అన్నారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీజేపీకి ఎన్నికల్లో గెలుస్తామనే విశ్వాసం ఉంటే ప్రతిపక్ష పార్టీల ప్రముఖులు, సీఎంలు కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ లాంటి వారిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. దేశంలో బీజేపీకి ప్రమాదకరంగా ఉన్నారంటే ఈడీ, సీబీఐ చేత దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులు తమకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తే ప్రజలు తమకు ఓట్లు వేయరనే భయంతోనే ఎన్నికల ముందు ఈ అరెస్టులు చేయిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలవకూడదనే లక్ష్యంతో తమ పార్టీ ముందుకెళ్తుందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం. చిత్రంలో బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సురేందర్

బీజేపీ, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలి

మాట తప్పిన పార్టీలకు బుద్ధిచెప్పాలి.. ● **మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 13: ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. తప్పు చేసిన వారిని శిక్షించే సమయం వచ్చిందని, హామీలతో మోసగించిన రెండు జాతీయ పార్టీలకు గుణపాఠం చెప్పాలని సూచించారు. శనివారం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పోచారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, మూడు నెలల పాలనలో దాని నిజస్వరూపం ప్రజలకు తెలిసిందని అన్నారు. ప్రధాని మోదీ రైతులను మోసం చేశారని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పి పదేండ్లు అయినా చేసిందేమీ లేదని విమర్శించారు. పదేండ్లు ఎంపీగా ఉండి ఏమీ చేయలేని బీబీ పాటిల్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసమే పాటిల్ పార్టీ మారినట్టు చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు.

మాదిగల ద్రోహి కాంగ్రెస్

- **టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు భిక్షపతి**



హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 13 : మాదిగలకు టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ విమర్శించారు. మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వపోతే 17 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను ఓడిస్తామని హెచ్చరించారు. శనివారం హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలైనా కాంగ్రెస్ పార్టీ మాదిగలను గుర్తించడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మంది మాదిగలుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 లక్షల మంది ఉన్నారని, మాలల ఉపకులాలకు మాత్రమే టికెట్లు ఇచ్చి మాదిగలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను పల్లెల్లోకి రానివ్వకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉండగా ఆయన కూతురికి ఎంపీ టికెట్ ఎందుకిచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను ఓడించడానికి సిద్ధం కావాలని ఆయన మాదిగలకు పిలుపునిచ్చారు.



మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

పూటకో పార్టీ మారుస్తూ నాపైనే విమర్శలా?

- **కొండా సురేఖపై ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఫైర్**

నర్సాపూర్, ఏప్రిల్ 13 : మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొండా సురేఖ తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పూటకో పార్టీ మారే కొండా సురేఖ తనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. ఎన్ని పార్టీలు మారి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారో ఓసారి గుర్తుచేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉంటే తాను పార్టీని వీడలేదని, పదేండ్లు కాంగ్రెస్ జెండాను భుజస్కంధాలపై మోశానని గుర్తుచేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తాను జిల్లా అధ్యక్షురాలిగా ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, తన వివరణ అడగకుండా కాంగ్రెస్ పార్టీ నుంచి 2 గంటల్లోపే తనను సస్పెండ్ చేశారని, అందుకే తాను కాంగ్రెస్‌ను వీడాల్సి వచ్చిందని తెలిపారు. ఎలాంటి పదవులు ఆశించకుండా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరినట్టు చెప్పారు. కానీ, కొండా సురేఖ మాత్రం కాంగ్రెస్ నుంచి వైఎస్సార్ సీపీ, ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి, అక్కడి నుంచి కాంగ్రెస్‌లో చేరిన విషయాన్ని మరిచి తనపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి ఓటేసినట్టేనని కొండా సురేఖ అనడం హాస్యాస్పదంగా ఉన్నదని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై బీఆర్ఎస్‌పై బురద జల్లడం తగదని సూచించారు.

రేవంత్ జైలుకెళ్లడం ఖాయం

- **ఓటుకు నోటు కేసులో శిక్ష తప్పదు**
- **బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ**

కొత్తకోట, ఏప్రిల్ 13 : ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమని బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. తప్పు ఎవరు చేసినా శిక్ష నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించిన అడ్డాకుల, మదనాపురం, కొత్తకోట మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలతో జనాన్ని మభ్యపెడుతున్నదని ధ్వజమెత్తారు. గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటు అడిగే నైతిక హక్కులేదని అన్నారు. ఫ్రీ బస్సులో మహిళలు సిగలు పట్టుకుంటున్నారని, పథకం అమలు చేసినప్పుడు బస్సులను పెంచాలన్న ఆలోచన లేకపోవడం దుర్మార్గమని అన్నారు. రావణాసురుడి వంటి కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో ఉండకూడదని ఆమె తెలిపారు. తనపై కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

వనపర్తి జిల్లా కొత్తకోటలో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ